
సాక్షి
బాపట్ల
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 7427 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1807 క్యూసెక్కులు వదిలారు.



సబ్‌జైలు సందర్శన

సత్తెనపల్లి: పట్టణంలోని సబ్‌జైలును గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి సోమవారం సందర్శించారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 22,035 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 36,950 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

కోటప్పకొండ ఆలయ ఈఓగా చంద్రశేఖరరావు

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈఓగా డి. చంద్రశేఖరరావు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న చంద్రశేఖరరావు సాధారణ బదిలీలల్లో భాగంగా కోటప్పకొండ ఆలయ ఈఓగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు కోటప్పకొండ ఈఓగా పనిచేస్తున్న ఎస్. శ్రీనివాసరెడ్డి అమరావతి ఆలయ ఈఓగా బదిలీ అయ్యారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



నాదెండ్ల: యడ్లపాడు మండల పరిధిలోని చెంఘీజ్‌ఖాన్‌పేట–సంతపేట గ్రామాల మధ్య చిలకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగటంతో సబ్‌స్టేషన్‌లో ట్రిప్ కావటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి పెను ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీలు

నరసరావుపేట: రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచన మేరకు కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌లు కూర్చోని విధులు నిర్వహించే పోడియం ప్రదేశం జడ్జి చాంబర్ లాగా ఉండకూడదనే నిబంధన అమలు చేశారా లేదా అనేది పరిశీలించారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్‌లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పౌరులకు అందిస్తున్న సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో పి.సరోజిని, రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


గుంటూరు డీటీసీగా సీతారామిరెడ్డి

పట్నంబజారు: గుంటూరు జిల్లా డీటీసీగా కె. సీతారామిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయవాడలో డీటీసీగా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరుకు బదిలీ చేస్తూ ఆర్టీఏ అధికారులు ఆదేశాలు వెలువరించారు. ఇప్పటివరకు పనిచేసిన షేక్ కరీంను ఏలూరుకు బదిలీ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ఎస్. శివరామ ప్రసాద్‌ను నియమించారు.

దేవదాయశాఖ ఏసీగా గ్రంధి మాధవి బాధ్యతలు

పట్నంబజారు: దేవదాయ శాఖ గుంటూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా గ్రంధి మాధవి నియమితులయ్యారు. తెనాలిలోని వైకుంఠపురం ఏసీగా పనిచేస్తున్న ఆమెను జిల్లా ఏసీగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

యార్డుకు 49,763 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 49,763 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 45,672 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 18,600 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 22,242 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

మాటకు కట్టుబడతారా?

కృష్ణా కరకట్ట పటిష్టం చేస్తామని చంద్రబాబు హామీ

"తుఫాన్‌లు, అల్పపీడనాలకు అధికంగా ప్రభావితమయ్యే బాపట్ల జిల్లాలోని కరకట్టలను పటిష్ట పరుస్తాం.. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోని కరకట్టలన్నీ పటిష్టం చేసి వరదలకు ఒక్క గ్రామాన్ని సైతం ముంపునకు గురికాకుండా చూస్తాం.."

- ఎన్నికలకు ముందు జిల్లాలో పర్యటించిన చంద్రబాబు ఇచ్చిన హామీ

వాస్తవ పరిస్థితి:

" ఈనెలలో వచ్చిన వరద బీభత్సానికి కరకట్టలకు కొన్ని చోట్ల గండిపడి 24 లంక గ్రామాల్లోని పంటపొలాలు నీటమునగగా, ఊళ్లకు ఊళ్లు జలమయమయ్యాయి. మరికొన్ని చోట్ల మాత్రం స్థానికులు, రైతులు, అధికారులు అప్రమత్తమై ఇసుక బస్తాలను, మట్టిని అడ్డుగా వేసి గండ్లను పూడ్చి నష్టనివారణ చేసుకున్నారు."

- చంద్రబాబు ఎన్నికల హామీ నెరవేరేనా?
- ఈ నెలలో కనీవినీ ఎరుగని వరద
- అరవింద వారధి వద్ద కృష్ణా గట్టుకు గండి
- పెదపులివర్రు, ఓలేరు–పల్లెపాలెం, రావి అనంతవరం, చాట్రగడ్డ వద్ద కరకట్టపైకి వరదనీరు
- పలుచోట్ల కట్టకు లీకేజీలు
- బెంబేలెత్తిన కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, రేపల్లె ప్రాంతాల ప్రజలు
- త్రుటిలో తప్పిన ప్రమాదం
- కరకట్టలను బలోపేతం చేయాలంటున్న ప్రజలు



కృష్ణా వరదల సమయంలో ఈనెల 1వ తేదీన అరవింద వారధివద్ద కరకట్టకు గండిపడిన ప్రాంతం



2009 అక్టోబర్ 5న భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం వద్ద కృష్ణానది కరకట్టకు గండి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: నాసిరకంగా మారిన కృష్ణానది కరకట్టలను బలోపేతం చేసి వరద ముప్పునుంచి తప్పించాలని పరీవాహక ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సెప్టెంబర్ నెల ప్రారంభంలో వచ్చిన వరదల తాకిడికి బెంబేలెత్తిన జనం తక్షణమే కరకట్టలను బలోపేతంచేసి భవిష్యత్తులో వరద తాకిడికి గురికాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వరద నష్టానికి ప్రభుత్వం ఇచ్చే మొక్కుబడి సాయంతో బాధిత కుటుంబాలు కోలుకునే పరిస్థితి ఉండదని, పదేపదే వరద బారిన పడి ఇళ్లు, వస్తువులు, పంటలతోపాటు సర్వం కోల్పోకుండా ఉండేందుకు కరకట్టలను ఆధునికీకరించాలని బాధితులు కోరుతున్నారు.

ఒకచోట గండి.. నాలుగుచోట్ల తప్పిన ప్రమాదం

సెప్టెంబర్ 1న కృష్ణా కరకట్టకు కొల్లూరు మండలం అరవిందవారధి వద్ద గండిపడింది. దీంతో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె ప్రాంతాల్లో 24 లంక గ్రామాలు నీటమునిగాయి. అదృష్టవశాత్తు ప్రాణనష్టం లేకపోయినా వేలాది ఇళ్లు, వ్యవసాయ, వాణిజ్య పంటలు నీటమునిగాయి. రూ. వందలకోట్ల నష్టం వాటిల్లింది. ఒక్కచోట కరకట్టకు గండిపడితేనే ఇంతస్థాయిలో నష్టం వాటిల్లింది. 12 లక్షల క్యూసెక్కుల డిజైన్‌తో ఉన్న కృష్ణా కరకట్టలు 11.38 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో ఉక్కిరి బిక్కిరయ్యాయి. కరకట్టలు నాసిరకంగా మారడంతో పెదపులివర్రు, చాట్రగడ్డ, ఓలేరు–పల్లెపాలెంల వద్ద వరదనీరు కట్టపైనుంచి వెలుపలికి పొర్లి ప్రవహించగా రావిఅనంతవరం, పెదపులివర్రు, ఓలేరు–పల్లెపాలెంల వద్ద కట్టకు ఊటలు వచ్చి నీరు లీకైంది. పై నాలుగు చోట్ల కరకట్టలు తెగే అవకాశముందని ప్రజలు బెంబేలెత్తారు. అధికారులు, స్థానికులు రేయింబవళ్లు శ్రమించి ఇసుక సంచులు, మట్టి, ఇసుక వేయడంతో కరకట్టలు తెగిపోకుండా ఆగాయి. నాలుగు చోట్ల కట్టలు తెగిఉంటే ఊహించని ప్రమాదం, నష్టంతోపాటు ప్రాణనష్టం అధికంగా ఉండేది.

40 కిలోమీటర్లకు పైగా...

బాపట్ల జిల్లాలో చిలుమూరు నుంచి రేపల్లె మండలం పెనుమూడి వరకు 40 కిలోమీటర్లకు పైగా కరకట్టలు ఉన్నాయి. కరకట్టల్లో పైపులు పూడ్చడం, మట్టిని పొలాల్లోకి చదును చేయడంతో కట్టలు బలహీనంగా మారాయి. ప్రధానంగా దోనెపూడి, కోటిపల్లి, వెల్లటూరు గ్రామాల పరిధిలో కరకట్టపై రోడ్డు నిర్మాణం జరగక పోవడంతో కట్టలు నాసిరకంగా మారాయి. తాజాగా వచ్చిన వరదలకు ఈపూరు, కొల్లూరు మధ్యన కరకట్ట అంచు పలుచోట్ల విరిగి పడింది. భట్టిప్రోలు, రేపల్లె ప్రాంతాల్లోనూ కట్టలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో కరకట్టలను బలోపేతం చేయడం అనివార్యంగా మారింది. భవిష్యత్తులో మరోమారు ప్రమాదం సంభవించకుండా ఉండాలంటే కృష్ణా కరకట్టలను యుద్ధ ప్రాతిపదికన మరింత బలోపేతం చేయాల్సి ఉంది.

పలుమార్లు భారీగా వరద..



సెప్టెంబర్ వరదలకు రావి అనంతవరం వద్ద కృష్ణా కరకట్టపైకి పొర్లిన వరదనీరు

- కృష్ణానదికి 120 సంవత్సరాల తర్వాత ఈ సెప్టెంబర్‌లో భారీ వరద వచ్చింది.
- 2009 అక్టోబర్ 5వతేదీ అర్ధరాత్రి భట్టిప్రోలు మండలం ఓలేరు–పల్లెపాలెం వద్ద కృష్ణా కరకట్టకు గండిపడి రేపల్లె పట్టణం నీటమునిగింది. 10.94 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో నాలుగురోజుల పాటు పట్టణం నీటిలోనే ఉండిపోయింది. ప్రజలు బోట్లలో తిరగాల్సివచ్చింది.
- 1903 అక్టోబర్ 7న 10.68 లక్షల క్యూసెక్కులు
- 1914 ఆగస్టు 11న 9.49
- 1917 నవంబర్ 2న 9.55
- 1949 సెప్టెంబర్ 24న 9.25
- 1964 అక్టోబర్ 2న 9.88,
- 1998 అక్టోబర్ 17న 9.32 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది.



భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వద్ద కట్టపైకి పొర్లిన వరద

కరకట్టలు బలోపేతం చేస్తామన్న చంద్రబాబు

తనకు అధికారం అప్పగిస్తే కృష్ణా కరకట్టలను బలోపేతం చేస్తామని గత ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. తాజాగా వచ్చిన వరదలను కళ్లారా చూసిన చంద్రబాబు బాపట్ల జిల్లాలో కృష్ణాకరకట్టలను బలోపేతం చేసేందుకు తక్షణమే సిద్ధం కావాల్సి ఉంది. వచ్చే వర్షాకాలం సీజన్ నాటికైనా కరకట్టలను బలోపేతం చేయకపోతే మరోమారు జిల్లా వాసులు వరద విపత్తును ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కరకట్టల బలోపేతానికి సన్నద్ధం కావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కరకట్ట బలోపేతంపై సత్వరం స్పందించాలి..



కరకట్టలు బలహీనంగా మారడంతో వరదల సమయంలో నదీ తీరానికి ఇవతలి పక్కనున్న వందలాది గ్రామాలు, పట్టణాలు భయం గుప్పెట్లో జీవనం సాగించాల్సిన పరిస్థితి. 2009 కృష్ణా వరదల కారణంగా కరకట్టకు కోత ఏర్పడి ఎన్నో గ్రామాలు, పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. ఇటీవల సంభవించిన వరదల సమయంలో కరకట్టలు ఎక్కడ తెగుతాయోనన్న ఆందోళనతో ప్రజలందరూ మూకుమ్మడిగా కరకట్టలపై రేయింబవళ్లు కాపాలాలు కాసుకొని, ఇసుక మూటలు వేసి కట్ట తెగకుండా శ్రమించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇటువంటి పరిస్థితి దాపురించి పంట నష్టంతోపాటు, ప్రాణ నష్టం సంభవించకుండా ప్రభుత్వం తక్షణం స్పందించి కరకట్టను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలి.

– ఇంటూరి ప్రవీణ్, ఎంపీటీసీ సభ్యుడు, దోనేపూడి, కొల్లూరు మండలం

మట్టి కోసం 'తమ్ముళ్ల' వివాదం



పోలీసు స్టేషన్ ఎదుట ఉన్న ట్రాక్టర్లు, పొక్లెయిన్



పోలీసు స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగేందుకు యత్నిస్తున్న నాగిరెడ్డి (పసుపు చొక్కా వ్యక్తి)

- రేణింగవరం ఊరచెరువులో మట్టిని తవ్వి తరలిస్తుండగా టీడీపీ నేత యల్లాల నాగిరెడ్డిని అడ్డుకున్న పోలీసులు
- పొక్లెయిన్, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- గ్రామానికి చెందిన మరో టీడీపీ నేత బోరెడ్డి బోబులరెడ్డి 300 ట్రాక్టర్లకు పైగా మట్టిని తరలిస్తే ఎందుకు అడ్డుకోలేదని ఎస్‌ఐని ప్రశ్నించిన నాగిరెడ్డి
- పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం

జే.పంగులూరు: అధికార తెలుగుదేశం పార్టీలో అధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంది. మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో ఎన్నికలకు ముందు అందరూ కలిసికట్టుగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతికొద్ది కాలంలోనే తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలుగా విడిపోయారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు యల్లాల నాగిరెడ్డి తన అన్న ఇంటి నిర్మాణాకి పునాదికి కోసం సోమవారం గ్రామంలోని ఊరచెరువులో మట్టిని తీసేందుకు పొక్లెయిన్‌తో వెళ్లాడు. ఈక్రమంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతం వద్దకు వెళ్లి చెరువు మట్టి తవ్వే పనులను అడ్డుకొన్నారు. పొక్లెయిన్‌ను, ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం

తాను ప్రారంభం నుంచి పార్టీలోనే ఉన్నానని, మట్టి తవ్వుతుంటే పనులు ఎలా ఆపుతారని ఎస్‌ఐని నాగిరెడ్డి ప్రశ్నించాడు. గత నాలుగు రోజుల నుంచి మరో వర్గానికి బోరెడ్డి బోబులరెడ్డికి సంబంధించిన వర్గం మట్టి తవ్వకాలు జరుపుతుంటే అప్పుడు మీకు కనపడలేదా అని ప్రశ్నించాడు. గత నాలుగు రోజుల్లో గ్రామంలో ఇంచుమించు 300 ట్రాక్టర్లకు పైనే బోరెడ్డి వర్గం మట్టి తవ్వకాలు చేస్తుంటే పోలీసులు అప్పుడు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఒక వర్గానికి వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏళ్ల తరబడి పార్టీని అంటి పెట్టుకొని ఉన్న తమకు న్యాయం జరగడం లేదని, పూటకో పార్టీ మారే వారికే న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈక్రమంలో పోలీస్ స్టేషన్ ఎదుట తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బా మూత తీసి తాగే ప్రయత్నం చేశాడు. పోలీసులు, చుట్టు పక్కలవారు ఎంత నివారించినా కొంత మందు తాగేశాడు. వెంటనే నాగిరెడ్డిని అద్దంకి ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తరలించారు.

నాగిరెడ్డికి ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత

నా తమ్ముడు నాగిరెడ్డి పోలీసులు చెరువు వద్దకు వచ్చిన దగ్గర నుంచి ఎస్‌ఐకి చెబుతూనే ఉన్నాడు. నా వాహనాలు పోలీస్ స్టేషన్‌కు తరలిస్తే స్టేషన్ ముందే పురుగుల మందు తాగి చనిపోతానని హెచ్చరించినా.. పోలీసులు పట్టించుకోలేదు. మొట్టమొదటి నుంచి టీడీపీని అంటి పెట్టుకొని ఉన్న నా తమ్ముడికి పార్టీ అధికారంలోకి వచ్చినా విలువ లేకుండా చేస్తున్నారు. ఎన్నికల ముందు వరకు తన స్వలాభం కోసం వేరే పార్టీలో ఉండి, పూటకో పార్టీని మార్చే వారు ఇక్కడ పెత్తనం చేస్తున్నారు. నా తమ్ముడు నాగిరెడ్డికి ఎమైనా జరిగితే దానికి పోలీసులు బాధ్యత వహించాలి.

– యల్లాల ఓబుల్ రెడ్డి, నాగిరెడ్డి సోదరుడు

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు..

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో మట్టి తవ్వకాలను అడ్డుకున్నాం. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– వినోద్‌బాబు, రేణింగవరం ఎస్‌ఐ

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- గ్రీవెన్స్‌లో 146 అర్జీలు నమోదు



సమస్యల క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తన పరిధిలోని వాటికి జిల్లా కలెక్టర్ పరిష్కార మార్గం చూపగా, కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిగిలినవి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 146 అర్జీలు నమోదయ్యాయి. ఇప్పటివరకు 191 అర్జీలు పునరావృతం అయ్యాయన్నారు. పరిష్కారంలో నాణ్యత లోపించడంతోనే పునరావృతం అవుతున్నాయని అధికారులను హెచ్చరించారు. పీజీఆర్ఎస్‌పై అధికారుల్లో నిర్లిప్తత ఉండరాదన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ కోసం ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈనెల 30వ తేదీన జిల్లాస్థాయి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరించడానికి క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తెచ్చామన్నారు. స్కానింగ్ చేసిన వెంటనే 11 రకాల ప్రశ్నలు ప్రత్యక్షం అవుతాయని, తద్వారా తమ సూచనలను ఆన్‌లైన్‌లో పొందుపరచవచ్చని వివరించారు. జిల్లా జేసీ ప్రఖర్ జైన్, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ జి.రవీందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత డీఎస్పీ ఇంట్లో భారీ చోరీ

28 సవర్ల బంగారం, రెండు వజ్రాల నెక్లెస్‌లు, ఏడు కిలోల వెండి అపహరణ

లక్ష్మీపురం: కారులో వచ్చి ఇద్దరు వ్యక్తులు విశ్రాంత డీఎస్పీ ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న బంగారం, వజ్రాల నక్లెస్‌లు, వెండి వస్తువులు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగినట్టు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరులోని చంద్రమౌళీనగర్ 6/1ఎ లైన్‌లో దొంగలు కారులో నుంచి దిగి తొలుత కృష్ణా రెసిడెన్సీ అపార్టుమెంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వాచ్‌మన్ మెలకువగా ఉండటాన్ని గమనించి దాని ఎదురుగా ఉన్న లీలా హోమ్స్ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి రెక్కీ నిర్వహించారు. మొదటి అంతస్తులో విశ్రాంత డీఎస్పీ పెంచల నాయుడు ఇంటికి తాళం వేసి ఉన్నట్లు గుర్తించారు. ఆయన శనివారం కుటుంబ సభ్యులతో నెల్లూరు వెళ్లారు. దీంతో ఇద్దరు దొంగలు ఇంటి ప్రధాన తలుపు తాళాలు పగలగొట్టి లోపలకు చొరబడ్డారు. బీరువాలో ఉన్న బంగారం, వజ్రాల నక్లెస్‌లు, వెండి వస్తువులను చోరీ చేసి తిరిగి అదే కారులో పరారయ్యారు. అయితే ఉదయం వాచ్‌మన్ మొదటి అంతస్తులోకి వెళ్లిన సమయంలో తలుపులు పగలగొట్టి ఉన్నట్లు గమనించాడు. విశ్రాంత డీఎస్పీ పెంచలనాయుడుకు సమాచారం తెలియజేశారు. ఆయన ఈ విషయాన్ని పట్టాభిపురం పోలీసులకు, వెస్ట్ డీఎస్పీ జయరాంప్రసాద్‌కు తెలిపారు. దీంతో డీఎస్పీ, పట్టాభిపురం ఎస్‌ఐ రాంబాబు, సీసీఎస్ సీఐ వెంకన్న చౌదరి, సీసీఎస్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ చేరుకుని ఆధారాలను సేకరించాయి. సీసీ కెమెరాలను డీఎస్పీ పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి కృష్ణా రెసిడెన్సీలో గమనించి, ఆ తరువాత లీలా హోమ్స్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. పెంచలనాయుడు కుటుంబ సభ్యులతో సాయంత్రం 4 గంటలకు అపార్టుమెంట్‌కు చేరుకున్నారు. బీరువాలో ఉన్న 28 సవర్ల బంగారం, 7కేజీల వెండి, రెండు వజ్రాల నెక్లెస్‌లు చోరీ అయినట్లు ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గమ్మకు లక్ష్మీ కాసుల హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గుంటూరుకు చెందిన భక్తులు 53 గ్రాముల బంగారంతో తయారు చేసిన లక్ష్మీ కాసుల హారాన్ని కానుకగా సమర్పించారు. గుంటూరు శ్రీనగర్ కాలనీకి చెందిన కె. కిరణ్ బాబు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి సోమవారం వచ్చింది. ఈ సందర్భంగా రూ. 3.50 లక్షల విలువైన 53 గ్రాముల బంగారంతో తయారు చేయించిన లక్ష్మీ కాసుల హారాన్ని ఆలయ అధికారులకు అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

క్లుప్తంగా

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అనంతరాజు బాధ్యతల స్వీకారం



బాపట్ల: బాపట్ల ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా మూనూరు అనంతరాజు బాధ్యతలు చేపట్టారు. కాకినాడలో డీఈగా పని చేస్తూ పదోన్నతిపై బాపట్ల వచ్చిన ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు గ్రామీణ నీటి సరఫరా విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించి తాగు నీటి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో డీఈ కటికల రాంబాబు, ఏఈలు మంజూరుబాషా, భాగ్యరాజు, ధనలక్ష్మి, అనూష తదితరులు అభినందించారు.

పిడుగుపాటుతో మహిళ మృతి

రేపల్లెరూరల్: పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు 25వ వార్డుకు చెందిన కొలుసు పద్మ సోమవారం సాయంత్రం తన గొడ్లసావిడి వద్ద పనిచేసుకుంటున్న సమయంలో ఆకస్మికంగా కురిసిన వర్షంతో సమీపంలో పిడుగు పడింది. దీంతో పద్మ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈవిషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

యూనివర్సిటీ ఏసీఈగా ఎన్.యోబు

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ ఏసీఈ అదనపు పరీక్షల నియంత్రణాధికారి)గా డెప్యూటీ రిజిస్ట్రార్ ఎన్.యోబు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉప కులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా యోబు మాట్లాడుతూ తనను అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా నియమించిన యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు మంచి సేవలు అందిస్తానని చెప్పారు. యూనివర్సిటీ ఖ్యాతి ఇనుమడింపజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. వికాస కార్యదర్శి కె. శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, ఉద్యోగులు భాను ప్రసాద్, ఎన్. నాగేశ్వరరావు, జె. శ్రీనివాసరావు, వై. రాధాకృష్ణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్రవ్యాప్తంగా వరదల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసి, ప్రకటించిన సుఖీభవ పథకం కింద రూ. 20 వేలను ఖాతాలో వేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజధాని రైతు సంఘ నేతలు, రైతులతో ఆయన ధర్నాను నిర్వహించారు. విత్తనాలు ఉచితంగా అందించాలని, ఎరువులు, పశువుల గడ్డి సబ్సిడీపై ఇవ్వాలని తెలిపారు.

అర్జీలు పునరావృతం కాకూడదు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- పోలీస్ గ్రీవెన్స్‌కు 89 అర్జీలు



సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: సమస్యల పరిష్కారం అందజేసే అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 89 మంది అర్జీలు అందించారు. ప్రజల సమస్యలను విని, ఇచ్చిన అర్జీలను పరిశీలించి, వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కారించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వచ్చేవారికి భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రూ.3.41 లక్షలు విలువ చేసే వస్తువులు స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

అద్దంకి: పలు దేవస్థానాల్లో, ఎవరూ లేని ఇళ్లల్లో చోరీలు చేసే దొంగను పట్టుకొని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సోమవారం అద్దంకి - నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారిలోని కొంగపాడు డొంకవద్ద నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ కృష్ణయ్య చెప్పారు. సీఐ వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామానికి చెందిన తన్నీరు మధు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే చెడు వ్యసనాలకు బానిసైన ఇతను కూలి పనులతో వచ్చే డబ్బులు సరిపోక దొంగతనాలకు అలవాటు పడ్డాడు. దాదాపు 20 సంవత్సరాల నుంచి మార్టూరు, జె.పంగులూరు, మద్దిపాడు, సంతమాగులూరు, ఒంగోలు, కనిగిరి, ఇంకొల్లు, బల్లికురవ, చీమకుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు దేవస్థానాలు, ఇళ్లల్లో రాత్రిళ్లు దొంగతనాలు చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఆయా స్టేషన్లలో నిందితుడిపై కేసులు నమోదై ఉన్నట్లు సీఐ చెప్పారు.

నిందితుడి నుంచి రూ.3.41 లక్షల విలువ కలిగిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ పర్యవేక్షణలో బృందంగా ఏర్పడి నిందితుడిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. ఈసందర్భంగా వారిని ఆయన అభినందించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలి

ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానాన్ని గ్రామాలలో విస్తరింపజేసి, అధిక శాతం మంది రైతులు సాగు చేపట్టేలా అవగాహన కల్పించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల గ్రామ సమైక్య ప్రతినిధులకు, బుక్ కీపర్స్‌కి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సంఘంలో ప్రకృతి వ్యవసాయం అజెండాగా పెట్టి ప్రతి సభ్యురాలు ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా చూడాలని, అంతేకాకుండా ప్రతి సభ్యురాలు వారి ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంచుకోవాలని సూచించారు. పేదరికంలో ఉన్న కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలంటే ప్రకృతి వ్యవసాయం ఒకటే సరైన మార్గమని అన్నారు. ప్రతి కుటుంబం వారి వార్షిక ఆదాయంలో 60 శాతం ఆరోగ్యం పైనే ఖర్చు పెడుతుందని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన విష రహిత, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తినడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పలు రకాల పంటల విధానం ఆచరించడం ద్వారా భూమి సారవంతం అవుతుందని, పంటలకు చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, సైదయ్య, పవన్‌కుమార్, మౌనిక, మండల సమైక్య అధ్యక్షురాలు హాజరబి, ఎంటీలు అనంతలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: హౌసింగ్ లే అవుట్స్, సొంత స్థలాలు, ఇప్పటికే మంజూరు చేసిన స్థలాల్లో ఆప్షన్ 1, 2 విభాగంలో నిర్మిస్తున్న ఇళ్లను వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి సోమవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమాన్ని సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద మంజూరు చేసిన ఇళ్లల్లో 28,730ను ఆప్షన్-1, 2లలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్నారని కలెక్టర్‌తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 11 వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, మిగతావి వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా కృషి చేయాలని ఆదేశించారు. ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ప్రతి లేఅవుట్‌కు ప్రత్యేకాధికారుల్ని నియమించి మంగళ, బుధవారాల్లో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ప్రత్యేకాధికారులు ఈ నెల 26న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించి, వివరాలు సేకరించాలని ఆమె తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 100 రోజుల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సీపీఓ శేషశ్రీ, జిల్లా ఉపాధి అధికారి రఘు, జిల్లా పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ పాల్గొన్నారు.

జిల్లాలో ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. ప్రత్తిపాడు మండలంలో 11 మిల్లీ మీటర్లు, పెదనందిపాడు 8.4, మంగళగిరి 5, తెనాలి 3, పొన్నూరు 1.8, కాకుమాను 1.2, చేబ్రోలు 1, గుంటూరు పశ్చిమలో 0.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.

నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంటులో చోరీ

రూ 70వేలు, రూ. 4లక్షల విలువైన సామగ్రి అపహరణ

మంగళగిరి: నగర పరిధిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంటులో చోరీ జరిగింది. రూరల్ సీఐ శ్రీనివాసరావు సోమవారం తెలిపిన వివరాల మేరకు.. చినకాకానిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి కార్యాలయం అద్దాలు పగలకొట్టారు. కౌంటర్‌లోని రూ. 70వేలతో పాటు రూ. 2.50లక్షల విలువైన విద్యుత్ వైరుని దొంగలించారు. భవన యజమాని నేరేళ్ల మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

చెరువులో పడి బాలుడి మృతి



దేవరాజు మృతదేహం

గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తూ చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్యానగర్ 4వ లైనుకు చెందిన చల్లా దేవరాజు (13) స్నేహితులతో కలిసి ఆడుకుంటూ స్థానికంగా ఉండే సమ్మర్‌పేట స్టోరేజ్ ట్యాంక్ చెరువులో పడ్డాడు. స్థానికులు గమనించి బయటకు తీసి, చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. సంఘటనపై మృతుని తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డ్రాగా ముగిసిన సెంట్రల్, నార్త్‌జోన్ మ్యాచ్

నార్త్ జోన్‌కు 8, సెంట్రల్ జోన్‌కు 6 పాయింట్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ ఇంటర్ జోన్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్, నార్త్ జోన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించిన నార్త్ జోన్‌కు 8, సెంట్రల్ జోన్‌కు ఆరు పాయింట్లు లభించాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ తన తొలి ఇన్నింగ్స్‌లో 188 పరుగులు చేయగా, నార్త్ జోన్ రెండు వికెట్ల నష్టానికి 85 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో సోమవారం బ్యాటింగ్‌కు దిగి తొమ్మిది వికెట్లు నష్టానికి 193 పరుగులు చేసింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ ఎనిమిది వికెట్లు నష్టానికి 188 పరుగులు చేసింది. జట్టులోని జీవీఎస్ సుమిత్ 50, జీఎస్ స్వామి 56 పరుగులు సాధించారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్ జోన్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా తొమ్మిది పరుగులు చేసింది. అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్. సీతాపతిరావు మ్యాచ్‌ను పర్యవేక్షించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలు విడుదల చేయాలి



నరసరావుపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు ముగిసినా విద్యారంగంలోని సమస్యలకు పరిష్కారం లభించలేదని, వెంటనే సమస్యలు పరిష్కారం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో జిల్లా కమిటీ నాయకులతో కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పి నేడు కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ విధానం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలలో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నెంబర్ 77 తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువుకునేటువంటి సంక్షేమ హాస్టల్లో నేడు సంక్షేమానికి దూరంగా ఉంటున్నాయని అన్నారు. సంక్షేమ హాస్టళ్లకు పూర్తిస్థాయిలో భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ఏడు నెలల నుంచి మెస్ ఛార్జీలు ఇవ్వడం లేదని, తక్షణమే మెస్ ఛార్జీలు విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 35, 36, 42లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మెడికల్ కాలేజీలకు ప్రైవేట్ పరం చేయడం కోసం వేసే అడుగులను తక్షణమే ఆపాలని, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డి.అమూల్య, రోహిత్, షాదుల్లా, ఫణి, యాసిన్, సత్తి పాల్గొన్నారు.

27న చదరంగం పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల్లోని విద్యార్థినులు, విద్యార్థులకు క్రీడా పోటీలు, జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న అమరావతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలల చెస్, అక్టోబర్ 3న చిలకలూరిపేటలోని ఏఎంజీ కళాశాలలో నెట్‌బాల్, జూడో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు విధిగా టెన్త్ మార్కుల జాబితా కాపీపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో హాజరుకావాలని ఆయన సూచించారు.

సర్వం కోల్పోయాం.. రుణాలు రద్దు చేయండి

తహసీల్దార్‌కు వరద బాధిత మహిళల వినతి



కొల్లూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు, ప్రజా సంఘాల నేతలు

కొల్లూరు: కృష్ణా నదికి కనివినీ ఎరుగని రీతిలో సంభవించిన వరదల కారణంగా సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిన తమ నుంచి డ్వాక్రా రుణాలు వసూలు చేయకుండా శాశ్వతంగా రద్దు చేసి ఆదుకోవాలని కోరుతూ మహిళలు కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. వరద సృష్టించిన విధ్వంసం కారణంగా మండలంలోని 22 గ్రామాలలో పంటలు కోల్పోవడంతో పాటు, వ్యవసాయాధారిత రంగాలు కుదేలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పశువులు, మేకలు వంటి జీవాలకు అవసరమైన పశుగ్రాసం సైతం లేకుండా పోవడం, ఇళ్లు ధ్వంసమై వంట సామగ్రితో సహా వరద నీటిలో కొట్టుకుపోవడంతో జీవనాధారం లేకుండా మిగిలామని వాపోయారు. వ్యవసాయ పంటల నష్టం, ఇతర నష్టాల కారణంగా కొన్నేళ్ల వరకు కోలుకోలేని పరిస్థితుల్లో కూరుకుపోయిన తాము డ్వాక్రా రుణాలు చెల్లించే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దార్‌కు విన్నవించారు. గ్రామీణ పేదరిక నిర్మూలనలో భాగంగా స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను పంటలకు, పశు పోషణకు వెచ్చించి వరదల కారణంగా మొత్తం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన రుణాలను రద్దు చేసి ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు తోడేటి సురేష్, పంతగాని నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వంద రోజుల పాలనలో అనేక సంస్కరణలతో సంక్షేమ పాలనను అందించామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తప్పక అమలు చేస్తామని చెప్పారు. ఈసందర్భంగా పట్టణంలోని పలు గృహాలను సందర్శించి ఇది మంచి ప్రభుత్వం స్టికర్‌లను అంటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ హెలా షారోన్, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, కమిషనర్ సాంబశివరావు, ఎంపీడీఓ శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పరిహారం ఏ మాత్రం సరిపోదు

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు



అద్దేపల్లిలో వరద ముంపులో ఉన్న పంటలను పరిశీలిస్తున్న హరిబాబు

భట్టిప్రోలు: ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం ఏ మాత్రం సరిపోదని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. సోమవారం భట్టిప్రోలు, అద్దేపల్లి ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అద్దేపల్లిలోని అమ్మవారి చెట్టువద్ద మాట్లాడుతూ మాగాణిలో ఒక్కో రైతు రూ.15 వేల నుంచి రూ. 30 వేల వరకు ఇప్పటికి ఖర్చు చేశారని, కౌలు రైతులు ఐతే రూ. 40 నుంచి రూ. 50 వేల వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేవలం రూ. 10 వేలు మాత్రమే అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సబబు కాదన్నారు. ఈ పరిహారాన్ని మరింత పెంపుదల చేయాలని కోరారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో మురుగు కాల్వలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. కౌలు రైతులకు పూర్తిస్థాయిలో ఈ-క్రాప్ నమోదు చేసి ప్రతి ఒక్కరికీ నష్ట పరిహారం అందచేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.సత్యన్నారాయణ, బి.సుబ్బారావు ఉన్నారు.

ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు కేఎల్‌యూ విద్యార్థులు



ఉమా మహేష్



ముఖేష్

తాడేపల్లి రూరల్: పెరు దేశంలోని లిమాలో ఈ నెల 26 నుంచి అక్టోబర్ 6 వరకు జరగనున్న జూనియర్ ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు కేఎల్‌యూ విద్యార్థులు నేలవల్లి ముఖేష్, మద్దినేని ఉమా మహేష్‌లు ఎంపికయ్యారని వర్సిటీ క్రీడల అసోసియేట్ డీన్ కె. హరికిశోర్ తెలిపారు. సోమవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల ఈ పోటీలలో పాల్గొనే భారత జట్టును ప్రకటించిందని చెప్పారు. ఇందులో తమ విద్యార్థులు నేలవల్లి ముఖేష్, మద్దినేని ఉమా మహేష్ ఉన్నట్లు తెలిపారు. ముఖేష్ సీఎస్ ఐటీ మూడో సంవత్సరం , ఉమా మహేష్ 4వ సంవత్సరం చదువుతున్నాడని పేర్కొన్నారు. వీరిద్దరూ ఒలింపిక్ పతక విజేత గగన్ నారంగ్‌కు చెందిన గన్‌ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీలో అంతర్జాతీయ కోచ్‌లతో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షకుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థులకు వర్సిటీ వీసీ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్‌చాన్సలర్ ఎ.వి.ఎస్. ప్రసాద్,రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ కె.హరికిశోర్, వ్యాయామ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు చేయాలి

వీఆర్‌ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ బందగి సాహెబ్



మాట్లాడుతున్న వీఆర్‌ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు బందగి సాహెబ్

సత్తెనపల్లి: వీఆర్‌ఏలు అందరికీ పే స్కేలు అమలు చేయాలని, అర్హత ఉన్న వీఆర్‌ఏలు అందరికీ వీఆర్వోలుగా పదోన్నతులు ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ బందగి సాహెబ్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరాజు అధ్యక్షత వహించారు. బందగి సాహెబ్ మాట్లాడుతూ నామినీ లుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని, నైట్ వాచ్‌మన్, అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. 2005 వీఆర్‌ఏ సర్వీసు రూల్స్ ప్రకారం వీఆర్‌ఏలను ఉపయోగించుకోవాలన్నారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్లలో ఖాళీగా అటెండర్ పోస్టులు చాలా ఉన్నాయని, వాటిని వెంటనే వీఆర్‌ఏల చేత భర్తీ చేయించాలన్నారు. సమావేశంలో వీఆర్‌ఏల సంఘం గౌరవ అధ్యక్షురాలు మల్లేశ్వరి, అమరావతి మండల అధ్యక్షుడు రాజు, సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రవి, ప్రధానకార్యదర్శి మునాఫ్, ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, బెల్లంకొండ ప్రధాన కార్యదర్శి శ్రీను సాహెబ్, దుర్గి మండల అధ్యక్షుడు వెంకటేష్, రెంటచింతల మండల నాయకులు కనకయ్య తదితరులు పాల్గొ న్నారు.

ముందస్తు జాగ్రత్తలతో డెంగీని నివారించవచ్చు

జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్



లక్కరాజుగార్లపాడులో ఆరోగ్య కార్యకర్తలకు సూచనలు చేస్తున్న డీఎంఓ రవీంద్రరత్నాకర్

సత్తెనపల్లి: ముందస్తు జాగ్రత్తలతో డెంగీ వ్యాధిని నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామంలో దోమల నివారణ చర్యలను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీఎంఓ రవీంద్రరత్నాకర్ మాట్లాడుతూ ప్రజలు దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ముందస్తు జాగ్రత్తలతో దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగీ, చికున్ గున్యా, మలేరియా, బోద వ్యాధి, మెదడువాపు వ్యాధులను నివారించవచ్చన్నారు. గుడ్డు దశ నుంచి పెద్ద దోమ కావాలి అంటే ఏడు నుంచి పది రోజులు పడుతుందన్నారు. కావున వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించి ఆరబెట్టి మరలా నీరు పట్టుకోవాలని, ఫ్రై డే ఫ్రై డే పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలందరూ దోమతెరలు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సబ్ యూనిట్ ఆఫీసర్ షేక్ సుభాన్‌బేగ్, ఆరోగ్య విస్తరణ అధికారి పిట్టల శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకురాలు జే.సంపూర్ణదేవి, ఎమ్ఎల్‌హెచ్‌పీ సురేష్‌కుమార్, ఆరోగ్య కార్యకర్తలు పి.మేరీరాణి, పి నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.